డ్రైనేజీ సమస్యలపై సత్వర స్పందన



బైరాగిగూడలో పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ఎప్పుడు, ఎక్కడ డ్రైనేజీ సమస్య తలెత్తినా సత్వరమే స్పందించి పరిష్కార చర్యలు తీసుకుంటున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌లోని బైరాగిగూడలో అండర్ గ్రైండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. బండ్లగూడ జాగీర్‌లో సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఆపరేటర్స్‌తో మేకనైజ్డ్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ మాత్రమే జరుగుతుందని తెలిపారు. శానిటరీ జవాన్లు రామంజులు, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

దళిత రత్న అవార్డు గ్రహీతలకు సన్మానం



బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర దళిత రత్న అవార్డులు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంగని రాజు, ఉపాధ్యక్షులు గుండడ అమూల్‌రాజు, దళిత సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు గుండడ శేఖర్‌లకు అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటుకల రాజు, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గంగని హరికృష్ణ ఆధ్వర్యంలో వారికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దళిత సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేయాలని సూచించారు.

యువకుడి అదృశ్యం



కుమారస్వామి

శంషాబాద్ రూరల్: ఉద్యోగం వెతుక్కోడానికి కారులో చెన్నై వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లాకు చెందిన కురుపూడి కుమారస్వామి(23) మండలంలోని పెద్ద షాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. చెన్నైలో ఉద్యోగం వెతకడానికి వెళ్తున్నట్లు చెప్పి ఈ నెల 25న తన బాబాయి కారు తీసుకుని ఇంటి నుంచి బయలుదేరాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని సెల్‌కు ఫోన్ చేయగా.. స్విచ్ ఆఫ్ వచ్చింది. అతని కోసం పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మేయర్‌కు కార్పొరేటర్ వినతి

శేరిలింగంపల్లి: నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ బుధవారం కలిశారు. నల్లగండ్ల కూరగాయల మార్కెట్ అభివృద్ధి, డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి గురించి మేయర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మేయర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు వీరేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదల, క్రమశిక్షణతో విజయం తథ్యం

రాయదుర్గం: ప్రగతిశీల భారతదేశం కోసం మేధో సంపత్తిని పెంపొందించుకోవడానికి పట్టుదల, క్రమశిక్షణతో విద్యార్థులు చదువుకోవాలని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ జి కృష్ణవేణి పేర్కొన్నారు. రాయదుర్గంలోని పుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్–హైదరాబాద్ ప్రాంగణంలో 12వ తరగతిలో ప్రతిభ చాటిన వారికి 'ప్రతిభ సమ్మాన్.. సమారోహ్' పేరిట ఎఫ్‌డీడీఐ ,హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ లోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె విద్యార్థులను సన్మానించారు. సమాజం కోసం విద్యార్థులు, యువత తమవంతూ కృషి చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. డైరెక్టర్ డాక్టర్ తేజ్ లోహిత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలను కూడా అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.

సమస్యల సుడిలో శాస్త్రీపురం

రహదారులపైనే ప్రవహిస్తున్న మురుగు

- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య వ్యవస్థ
- ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనం
- రోడ్లన్నీ గుంతలమయం
- కార్పొరేటర్ లేకపోవడమూ ప్రధాన కారణమే...
- అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా ఆగ్రహం



శాస్త్రీపురం బస్తీలలో రహదారిపై నిలచిన మురుగునీరు

శాస్త్రీపురం: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శాస్త్రీపురం డివిజన్‌లోని పలు ప్రాంతాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. డివిజన్ ప్రజలు సమస్యలతో సతమతం అవుతున్నా సర్కిల్ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. డివిజన్‌లోనీ ఒక్క బస్తీల్లో కూడా ప్రజలకు కనీస వసతులు లేవంటే అతిశయోక్తికాదు.

- బస్తీలలో ఎక్కడ చూసినా పారిశుద్ధ్య సమస్యలు, మురుగునీటితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. డివిజన్ అభివృద్ధికి రూ. కోట్లు మంజూరవుతున్నా సమస్యలు తీరడం లేదు.
- శాస్త్రీపురం, హసన్‌నగర్, ఎన్టీఆర్‌నగర్, నురానీమసీద్, మదీనామసీద్, కింగ్స్‌కాలనీ, షఫీ కాలనీ, నూర్ కాలనీ తదితర ప్రాంతాలలో సౌకర్యాలు కరువై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- సమస్యలను పరిష్కరించాల్సిన ప్రజా ప్రతినిధులు బస్తీల వైపే చూడటం లేదంటూ పలు బస్తీల ప్రజలు విమర్శిస్తున్నారు. స్థానిక కార్పొరేటర్ గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలవడంతో ఇక్కడ కార్పొరేటర్ స్థానం ఖాళీగా ఉంది. దీంతో అధికారులు కన్నెత్తి చూడటం లేదంటూ స్థానికులు దుమ్మెత్తి పోస్తున్నారు.



రహదరారుల పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

ఎక్కడ చూసినా పారిశుద్ధ్య సమస్యలే...

ప్రధానంగా పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పలు ప్రాంతాల ప్రధాన రహదారులపై మురుగునీరు, ఏరులైపారుతున్న అధికారులు మాత్రం కనీస నివారణ చర్యలు తీసుకోవడం లేదు. మురుగునీటి సమస్యకు తోడుగా చెత్త సమస్య ఎక్కువగా ఉంది. బస్తీలు, రహదారుల పక్కన రోజుల తరబడి చెత్త కుప్పలుగా పేరుకుపోతోంది.

- ప్రధాన రహదారులపై మ్యాన్‌హోళ్లు పొంగుతుండటంతో మురుగు నీరు రహదారులపై నిలుస్తున్నది. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. మురుగు కారణంగా తీవ్రమైనా దుర్వాసన దోమల బెడద ఉందని ప్రజలు చెబుతున్నారు. మురుగునీరు రహదారులపైకి రాకుండా ఎప్పటికప్పుడు మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బందికి చెప్పినా స్పందించడం లేదని ఆయా బస్తీల ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా సర్కిల్ ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



శాస్త్రీపురంలో పొంగుతున్న మ్యాన్‌హోల్

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- డ్రగ్స్‌తో ఉజ్వల భవిత బుగ్గి
- అనర్థాలపై అవగాహన అవసరం
- రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు



మాట్లాడుతున్న డీఈఓ సుశీందర్‌రావు

అత్తాపూర్: తెలంగాణ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల్లోని గణితం, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు రాజేంద్రనగర్ పట్టణంలో ఎడిపై పాఠశాలలో ఆయన ఆదేశాల మేరకు మండల విద్యాధికారి ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. మూడవ రోజు ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు హాజరై శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం లక్ష్యం కోసం ప్రస్తుత సమాజంలో విద్యార్థులు డ్రగ్స్ మహమ్మారికి బానిస కాకుండా విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇస్తున్నామన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల అనర్థాలను విద్యార్థులకు తెలియజేయడం విద్యార్థులలో డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన కల్పించారు. ఈ అంశంపై ఉపాధ్యాయులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈఓ సుశీందర్‌రావు మాట్లాడుతూ... విద్యార్థులకు డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన కల్పించడం ఉపాధ్యాయుల ప్రథమ కర్తవ్యంగా పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచి డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉంచేందుకు పాఠశాలల నుంచే విద్యార్థులలో అవగాహన కల్పించాలన్నారు. రాబోయే రోజుల్లో డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే బాధ్యత అందరి ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్, కోర్సు డైరెక్టర్, రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు



పనులను పరిశీలిస్తున్న డీసీ రవికుమార్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలు, పాదచారులకు అసౌకర్యం కలగకుండా రోడ్లపై నిలిచిన వర్షపు నీటి సాఫీగా పల్లపు ప్రాంతాలకు వెళ్లేలా చేపట్టిన పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నామని జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ డీసీ రవికుమార్ అన్నారు. గగన్‌పహాడ్ సర్వీస్ రోడ్డుపై నీటి స్తబ్ధతను తొలగింపు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... నాలాలు, డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేస్తూ వర్షాకాలంలో నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చాలా వరకు డ్రైనేజీల్లో చెత్తాచెదారం, వ్యర్థాలు, కవర్లు ఉంటున్నాయన్నారు. వీటి కారణంగానే డ్రైనేజీలు నిండుకోని నీరు వెళ్లేందుకు వీలు లేకుండాపోతుందన్నారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తు డ్రైనేజీల్లో చెత్త, కవర్లు తదితర వాటిని వేయవద్దు అన్నారు. వీటిని వేయడం వల్ల వర్షం నీటితో పాటు డ్రైనేజీ నీరు వెళ్లేందుకు ఇబ్బందిగా మారి రోడ్లపై ప్రవహిస్తాయన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోడ్లపై నీరు ఉండకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు నీటి తొలగింపు పనులను చేపడుతున్నారన్నారు. ఏఎంవోహెచ్ రజనీకాంత్, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాటు కోడి గుడ్లకు భలే డిమాండ్



పౌల్ట్రీ సెంటర్ దగ్గర కోడి గుడ్ల కోసం లైన్‌లో నిల్చున్న ప్రజలు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని పౌల్ట్రీ సెంటర్ వద్ద విక్రయించే నాటు కోడి గుడ్లకు భలే డిమాండ్ ఉంది. ఇక్కడ రోజూ నాటుకోడి గుడ్లను పౌల్ట్రీ అధికారులు విక్రయిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విక్రయిస్తారు. నాటు కోడిగుడ్ల కోసం వివిధ ప్రాంతాల ప్రజలు ఇక్కడకు వస్తుంటారు. డిమాండ్ నేపథ్యంలో రోజూ ఉదయం ఉదయం 8 గంటల నుంచే క్యూలో నిల్చుంటారు. బ్రాయిలర్ కోడిగుడ్ల కంటే నాటు కోడి గుడ్లు ఆర్యోగానికి మంచివి. దీంతో పాటు బయట మార్కెట్ల కంటే ఇక్కడ ధర కూడా తక్కువ ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రజలు లైన్‌లో నిలబడి మరీ నాటుకోడి గుడ్లను కొనుగోలు చేస్తుంటారు.

ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళి



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించిన మోహనకృష్ణ, ఆయన అభిమానులు

మణికొండ: మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు 102వ జయంతిని పురస్కరించుకుని చిత్రపురి కాలనీలోని ఆయన విగ్రహానికి బుధవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ కుమారుడు మోహనకృష్ణ ముఖ్య అతిథిగా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నట జీవితంతో పాటు రాజకీయంగా రాణించిన ఆయనను తెలుగు ప్రజలు జీవితాంతం గుర్తుంచుకుంటారన్నారు. పేద ప్రజలకు ఆయన చేసిన సేవలు అమోఘమన్నారు. కార్యక్రమంలో చిత్రపురి హౌసింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి దొరై, కమిటీ సభ్యులు రామకృష్ణప్రసాద్, అలహరి, తెలుగు ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ కార్యదర్శి టి. ప్రసన్నకుమార్, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సత్కారం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్ డిప్యూటీ స్టేషన్ మాస్టర్ టి.పున్నారావు పదవీ విరమణ కార్యక్రమంను నిర్వహించారు. శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో స్టేషన్ మాస్టర్ రాజు ఆధ్వర్యంలో పున్నారావును రైల్వే ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 37 ఏళ్ళ సర్వీస్‌ను విజయవంతంగా పూర్తి చేశారన్నారు. కార్యక్రమంలో రైల్వేస్టేషన్ మాస్టర్ వెంకట్‌రెడ్డి, డిప్యూటీ స్టేషన్ మాస్టర్లు రాజీవ్‌కుమార్, సత్యవాస్, పాయింట్స్ మెన్స్ శ్రీనివాస్, క్రాంతి కుమార్, రాకేష్‌కుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యర్థాలను తరలించరా?





దుర్గానగర్-ఆరాంఘర్ రహదారిపై వేసిన మట్టికుప్పలు

మైలార్‌దేవ్‌పల్లి: డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించి రోడ్లపై వేశారు. ఆయా వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించే విషయంలో సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. వ్యర్థాలను ఇతర ప్రాంతాలకు తరలించాలని తాము పలుమార్లు కోరుతున్నా అధికారులు మాత్రం తమ పరిధి కాదంటే తమ పరిధి కాదు అంటూ తప్పించుకుంటున్నాని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారుల వెంట మోరీలు, నాలాలలో తీసిన మట్టి వ్యర్థాలను నిల్వ చేస్తున్నారు. దీంతో రహదారులపై ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అవికాస్తా వర్షాలు, గాలులకు తిరిగి డ్రైనేజీల్లోకే చేరుతున్నాయి. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దుర్గానగర్ నుంచి ఆరాంఘర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై మోరీలలోంచి తీసిన పూడిక తీత వ్యర్థాలను వేశారు. దీంతో ఈ దారి గూండా ప్రయాణించే వాహనదారులు, పాదచారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ లోపం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుందంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని కోరుతున్నారు.

వైభవంగా వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు



విశ్వక్సేనారాధన పూజలు నిర్వహిస్తున్న పండితులు

మణికొండ: మంచిరేవులలోని వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరం వైభవంగా ప్రారంభమయ్యాయి. నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల గ్రామ శివారు ఔటర్ రింగ్ రోడ్డు పక్కన ఉన్న దేవాలయం గోల్కొండ నవాబుల కాలంలో వారి వద్ద మంత్రులుగా పనిచేసిన అక్కన్న, మాదన్నలు నిర్మించారు. దేవాలయ నిర్మాణంతో పాటు దాని నిర్వహణ నిమిత్తం వందలాది ఎకరాల భూమిని కేటాయించారు. దేవాలయానికి అనాదిగా ప్రతి సంవత్సరం ఆనవాయితీగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మొదటి రోజు ఉదయం 8 గంటలకు స్వస్తివాచనం, విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రుత్విక్ వరణం, రక్షా బంధనం నిర్వహించారు. 11 గంటలకు హారతి, ప్రసాద గోష్టి, సాయంత్రం 6 గంటలకు మృత్సంగ్రహణ, అంకురారోణం పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం ధ్వజారోహణం, బలిహరణం , సాయంత్రం భేరి పూజ, దేవతాహ్వానము, హనుమంతవాహన సేవ, హారతి పూజలు ఉంటాయని అర్చకులు వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో సాగుదాం

- బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర



మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి సత్వర పరిష్కారానికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక తయారు, అమలుపరచుటలో భాగంగా రోజు వారీ ప్రణాళిక రూపకల్పనకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. రోజువారీగా చేపట్టే పనుల కార్యాచరణ రూపకల్పనకు వార్డు అధికారులు సంబంధిత వార్డులలో పర్యటించి సమస్యలు గుర్తించాలన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేయడంలో భాగంగా కార్యాచరణను రూపొందించనున్నారన్నారు. మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించడం లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. మేనేజర్ మంజులత, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఆర్‌వో కె.శివకుమార్, ఏఈఈ వి.రాజ్‌కుమార్, వివిధ సెక్షన్‌ల అధికారులు, సెక్షన్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఆపరేటర్లు, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... స్థానికంగా ఉన్న మైఫిల్ హోటల్ పరిసర ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఆయనను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జామ్ తయారీపై డ్వాక్రా మహిళలకు శిక్షణ



డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

ఏజీవర్సిటీ: శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా డ్వాక్రా సంఘాల మహిళలకు బొప్పాయి జామ్, పుచ్చకాయ జూస్, మామిడి ఫ్రూట్ జామ్ తయారీ విధానంపై బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళలకు ప్రాసెసింగ్ టెక్నిక్స్ హైజినిక్, మార్కెటింగ్ పద్ధతులు, నిల్వ ఉంచుకునే విధానాలపై అవగాహన కల్పించారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలపై ఇంటి వద్దే మహిళలు ఉపాధి అవకాశాలు కల్పించుకోవచ్చని తెలిపారు. వీటికి సంబంధించిన ముడి సరుకులను ఇంటి దగ్గరే తయారు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. 10 నుంచి 15 మంది వరకు బృందంగా ఏర్పడి వీటిని తయారు చేసి మార్కెటింగ్ చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగాం ఆఫీసర్ లావణ్య, డాక్టర్ దేవిరెడ్డి, కవిత, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వరదనీరు నిలవకుండా చూడాలి

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని ట్రాఫిక్, జీహెచ్‌ఎంసీ అధికారులు బుధవారం పరిశీలించారు. ట్రాఫిక్ మేడ్చల్ జోన్ అడిషినల్ డీసీపీ వీరన్న, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆనంద్‌లు పర్యవేక్షించారు. ఇంజనీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం వరద నీరు నిలవకుండా సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, ఏఈ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన ఉద్యాన శాస్త్రవేత్తలు



విద్యార్థులతో కలిసి పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



పండ్ల తోటలకు ఉన్న చీడపీడలను పరీక్షిస్తున్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు

ఏజీవర్సిటీ: శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉద్యాన శాస్త్రవేత్తలు విద్యార్థులతో కలిసి క్షేత్రస్థాయిలో పంటలను బుధవారం పరిశీలించారు. మొయినాబాద్ మండల పరిధిలోని కాశింబౌలి, అమ్డాపూర్ గ్రామాల్లో జాతీయ సేవా పథకంలో భాగంగా రైతులు పండిస్తున్న టమాట, మిరప, సొరకాయ, మామిడి, సపోటా, బొప్పాయి, గులాబీ తదితర పంటలను పరిశీలించారు. ఆయా రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, అనుసరించాల్సిన పద్ధతులు, ఎరువుల యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ప్రధానంగా పంటల్లో వచ్చే నూతన వంగడాలను ఎప్పటికప్పుడు రైతులు తెలుసుకోవాలని పేర్కొంటూ వాటిని అమలు చేయాలని సూచించారు. సరైన యాజమాన్య పద్ధతుల ద్వారానే అధిక దిగుబడి పొంది గిట్టుబాటు ధర లభిస్తుందని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. కీటక శాస్త్ర నిపుణులు, డాక్టర్ మానస, డాక్టర్ వేణుగోపాల్, వ్యాధి నిపుణులు వి.కృష్ణవేణి ఆధ్వర్యంలో వివిధ పూలు, కూరగాయలు, పండ్ల తోటలకు చీడపీడల నివారణకు చేపట్టాల్సిన పద్ధతులను రైతులకు వివరించారు. కీటకాల్లో కూడా మిత్ర, శత్రు కీటకాలు ఉంటాయని వాటికి అనుగుణంగా ఎరువులను తగిన మోతాదులో వాడాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా అధిక దిగుబడి కోసం సేంద్రియ ఎరువులను వాడాలని... వీలైనంతవరకు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు. కూరగాయల విభాగపు శాస్త్రవేత్త ఎ.వి.ఎన్.లావణ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.